కథా నిలయం
5153
శ్రీకాకుళం

# తెలుగు వాచకం

(మార్చి, 96 స్వాతి మాసపత్రికలో ప్రచురితం)

అరవిందరావుకు ఆంగ్ల భాషంటే అయిష్టత ఏమాత్రం లేదు కానీ తెలుగుభాషపైన మమకారం ఎక్కువ.

దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలంతటి మహామనీషి మన భాషను పొగిడితే మనవాళ్ళిప్పుడు దేశభాషలందు, వేషభాషలందు తెలుగును "లెస్" చేయటం అరవిందరావుకు మనస్తాపాన్ని కలుగచేస్తుంది. అక్షరాభ్యాసం అయిన దగ్గర్నుంచి 'అ, ఆ'లు నేర్పటంకంటె పిల్లలకు ఎ,బి,సి,డిలు నేర్పించేందుకు ఆరాటపడే తల్లిదండ్రులంటే ఏవగింపు ఆయనకు.

తెలుగు మాష్టారుగా రిటైరయిన అరవిందరావు 'తెలుగు వ్యాకరణం చెప్పబడును' అని ఓ బోర్డు రాయించి ఇంటి కాంపౌండ్ వాలుకు వేలాడదీశాడు.

తెలుగు వ్యాకరణం మీద లేని శ్రద్ధ, ఆసక్తి ఇంగ్లీషు గ్రామరు మీద ఎందుకో అర్థం కాలేదాయనకు. అది నేర్చుకోవటం అనవసరం అనిగానీ, తప్పనిగానీ కాదు ఆయన అభిప్రాయం. అలాగని తెలుగులో నేర్చుకునేందు కేముందంటే మాత్రం అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు ఆయన.

అచ్చులేవో, హల్లులేవో తెలీక, అనునాసికములంటేనూ, ద్రుతములంటేనూ అంతుపట్టక, యణ్ణులంటేనూ, త్రికములంటేనూ తికమకపడిపోతూ అవి నేర్చుకోకపోయినా నష్టమేమీ లేదని భావిస్తూ యాక్టివ్, పాసివ్ వాయిస్‌లు, సింపుల్, కాంపౌండ్ కాంప్లెక్స్‌లంటూ వందలూ, వేలూ ఖర్చుపెట్టి ఇంగ్లీషు క్లాసుల్లో చేరటం, ఇంగ్లీషుకే ప్రాధాన్యతనివ్వటం ఆయనకు అంతులేని కోపాన్ని కలిగిస్తుంది.

అందుకే ఈ ధోరణిలో కొంతవరకైనా మార్పు కలుగచేసి తృప్తిపొందాలని తెలుగు వ్యాకరణ క్లాసులు ప్రారంభించాలనుకున్నాడాయన.

తెలుగు మాస్టర్లను గురించి చులకనగా మాట్లాడినా, అపహాస్యం చేస్తూ చిత్రీకరించే తెలుగు మాస్టార్ల బొమ్మల్ని చూపినా అరవిందరావు కోపోద్రిక్తుడవుతాడు.

బోర్డు వేలాడదేసిన వారం రోజులకు ఓ అయిదారుగురు విద్యార్థులు వచ్చి చేరటం అరవిందరావుకు నూతనోత్సాహాన్ని కలుగజేసింది. తక్కువ ఫీజుకే క్లాసులు చెప్పటానికి నిర్ణయించుకున్నాడు. అతనికి ఆశయమంతా నేటి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తరిగిపోతున్న తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించాలని

మరో పదిరోజుల్లో అరవిందరావుకు విద్యార్థుల సంఖ్య ఇరవైకు చేరింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. అమితోత్సాహంతో పిల్లలకు అచ్చులు, హల్లుల్తో మొదలు పెట్టి సంధులు, సమాసాలు అలంకారాలు, విగ్రహవాక్యాలు పూర్తి చేశాడు.

నెల తిరక్కుండానే సగం మంది గైరుహాజరు కావటం అరవిందరావుకు మనస్తాపం కలుగ చేసింది. అయినా అయన ప్రయత్నం మానుకోలేదు. యమాతారాజభానసలగంతో ఛందస్సు వరకు తీసుకువచ్చాడు మిగిలివున్న పిల్లల్ని ఛందస్సు తెలుసుకుంటే స్వంతంగా పద్యాలు రాయవచ్చనే భావన కలిగించాడు పిల్లల్లో.

ఉత్పలమాల, చంపకమాల గురించీ, మత్తేభ శార్దూలాల గురించీ, సీస పద్యాల సొగసు గురించీ, కందపద్యాల కమ్మదనం గురించి వివరించి చెప్పేడు అరవిందరావు. ఇద్దరు ముగ్గురు చురుకైన పిల్లలు అప్పటికే తమ పరిధిలో పద్యాలు తయారు చేసి చూపించారు. అవి వ్యాకరణబద్ధంగా లేకపోయినా వారి ప్రయత్నానికి మెచ్చుకుని

ప్రోత్సహించాడు అరవిందరావు. వాటిలోని తప్పొప్పులను తెలియ చేసి వెన్నుతట్టేడు.

చదువవలసిన ముఖ్యమైన పుస్తకాల పేర్లు కొన్ని చెప్పి, అవి ఎక్కడ దొరుకుతాయో తెలియచేశాడు. కఠినమైన పదాల్ని చదువ వలసిన పద్ధతిని, సంధి విడదీసి చదివి అర్థం చేసుకోవలసిన మెళు కువను అనుశీలింపు చేసుకునే రీతిలో విశదీకరించాడు

శక్తివంచన లేకుండా, తన విద్వత్తునంతా రంగరించి తనం తటివారిని చేద్దామనుకున్న అరవిందరావుకు అనుకున్నంత ఉత్సా హంగా లేదు. అందుక్కారణం మిగిలిన కొద్దిమంది పిల్లలు కూడా కాలక్షేపం కోసం, ఒక రోజు వస్తే నాలుగు రోజులు మానేయటం చేస్తున్నారు.

ముగ్గురు కొత్తవాదు వచ్చి చేరుతుంటే నలుగురు పాతవాళ్ళు మానేస్తున్నారు.

అరవిందరావు ప్రారంభించిన తెలుగు వ్యాకరణ పాఠశాల అ చుట్టుపక్కల ఓ వినోదంగానూ, వేళాకోళంగానూ మారింది. అందుకు తోడుగా అదే వీధిలో మరో మూడు ఇళ్ళ అవతల ఇంగ్లీషు గ్రామరు చెప్పే మాస్టారింట్లో చోటు చాలనంతగా విద్యార్థులు కిట కిటలాడటం, ఉదయం, సాయంత్రం ఆ ఇంటి ముందు లెక్కలేనన్ని సైకిళ్ళు బారులు తీరి వుండటం అరవిందరావుకు ఆవేదనను రెట్టింపు చేశాయ్.

ఏ కొద్దిమందికైనా మాతృభాష మీద ఏమాత్రం అభిమానం కలక్కపోవడం ఆశ్చర్యాన్ని కలుగజేసింది. అరవిందరావుకు.

"కథ తెలుగు జీవితాన్ని ప్రతిబింబించేదిగా వుండాలి" కథల పోటీకి మన తెలుగు పత్రికలు పెట్టేనియమ నిబంధనల్లో ఒకటి గుర్తు కొచ్చిన ఆయన వదనంలో విరక్తితో కూడిన నవ్వు మెరిసింది.

"తెలుగు జీవితం కథలలోనే పరిమితం అయిపోయినట్లుంది, నిజజీవితాల్లో ఇంకా తెలుగుతనం తొణికిసలాడుతున్నదా! రంగ వల్లులు, హరిదాసులు, గొబ్బెమ్మలు, బంతిపూలూ, రాన్రానూ కను మరుగై పోవటంలేదూ! ఏవీ అలనాటి విల్లంబులు, కోతిబొమ్మలు, ఏవీ పప్పుబెల్లాలు, దసరా పండుక్కి పాడుకున్న 'అయ్యవారికి చాలు అయిదు వరహాలు' ఎక్కడ వినబడుతున్నయ్!

'ఉగాది పండుగకు వేపపువ్వు ప్రసాదం తినటకంటె జనవరి ఫస్టుకు గ్రీటింగ్స్ పంపడ ప్రాధాన్యత పొందలేదూ!'

'బొమ్మల కొలువులు, పేరంటాలు, పాతచింతకాయ పచ్చడై పోలేదూ!'

'దీపావళి పండుగకు సైతం బాణాసంచా కాల్చటానికి ఉవ్వి ళ్ళూరాల్సిన పసిపిల్లలు కూడా నిస్తేజంగా, నిర్లిప్తత కనబరుస్తూ ఏ స్టార్ టీ వీ. ప్రోగ్రామో, జీ టీ.వీ. కార్యక్రమమో చూస్తూ కూర్చుంటే చాలనుకునే ఈ దశలో నిజంగా తెలుగుదనం కనపడుతుందా! కథల్లో తప్ప! ఏదీ తెలుగుదనం, ఏదీ ఆ నిండుతనం!' ఆలోచనలతో ఆవేశం పెల్లుబికింది ఆయనలో కళ్లు ఎరుపెక్కినై. గుప్పెళ్లు బిగుసు కున్నయ్. ఆవేశంతోపాటు పంతం, పట్టుదల కూడా రెట్టింపయినై. అందుకే ఓ స్థిర నిశ్చయానికి వచ్చాడాయన.

ఎంతో కాలంగా కొడుకు తన దగ్గరకు రమ్మని బలవంతం చేస్తున్నా, మాతృభూమిని, సొంత ఊరును,ఇంటిని వదలి వెళ్లేందుకు ఇష్టపడని అరవిందరావు కొడుకు దగ్గరకు అమెరికా వెళ్లేందుకు సంసిద్ధుడయ్యాడు. భార్యకు తన అభిప్రాయాన్ని తెలియపరుస్తూ కొడుక్కి ఉత్తరం రాశాడు.

కారణం ఏదయితేనేం తండ్రి తన వద్దకు వచ్చేందుకు ఇష్ట పడటం అమితానందం కలుగజేసింది అరవిందరావు కొడుకు సుధీర్‌కు

వీలయినంత త్వరలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని అమ్మా నాన్నలను తనదగ్గరకు తెచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించాడతను.

200 సంవత్సరాల క్రితం జన్మించిన అమెరికాలో అమెరికన్లు అంటూ ఎవరూ లేరనీ, వివిధదేశాల నుంచి వలస వచ్చి అక్కడ స్థిరపడిపోయిన అనేక జాతుల, మతాల, సంస్కృతుల కలయికే అమెరికన్ ప్రజ అని ఎందరికి తెలుసు?

ప్రపంచంలోని అన్ని దేశాల్లో స్వదేశీయులు, స్వజాతీయులు అని ఆ దేశానికి ఆ జాతికి లేక జాతులకు చెందిన మనుషుల, వారికో చరిత్ర, నాగరికత సంస్కృతీ వగైరా వున్నాయ్. కానీ ఒక్క అమెరికా దేశానికే ఇవేమీ లేవు.

అందుకే తెలుగుతనాన్ని, తెలుగు సౌందర్యాన్ని అక్కడున్న మన తెలుగువారికి అర్థమయ్యేలా, ఆసక్తి కలిగేలా వివరించి, విశదీకరించిచెప్పాలనీ, తెలుగు వెలుగు నువిరజిమ్మాలనీ అమితోత్సాహంగా కొడుకు దగ్గరకు అమెరికా ప్రయాణమయ్యాడు అరవిందరావు.

కొడుక్కి అక్కడున్న పరిచయాల వల్లనయితే నేమి, తను గౌరవగా, చనువుగా పెంచుకున్న పరిచయాల వల్లనయితేనేమి అరవిందరావు అమెరికాలో తెలుగు పాఠశాల ప్రారంభించాడు. అనతి కాలంలోనే ఎందరో తెలుగువారి అభిమానానికి పాత్రుడయ్యాడు. పిల్లలూ, పెద్దలు కూడా అరవిందరావు దగ్గర పాఠాలు నేర్చుకునేందుకు ఉవ్విళ్లూరేరు.

ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా తీసుకుని దృఢసంకల్పంతో, స్థిరచిత్తంతో సత్కార్యానికి పూనుకుని పురోగమిస్తే విజయం వరించక తప్పదన్న విశ్వాసంతో ద్విగుణీకృత ఉత్సాహంతో తరగతులు ప్రారంభించాడు అరవిందరావు. అక్షరాన్ని పరబ్రహ్మస్వరూపంగా ఆరాధించడం మన సంస్కృతి అని తెలియపరచాడు ముందుగా.

శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో అని వేద మూర్తులకు నమస్కరించి భారతకథను అంధ్రీకరణకు శ్రీకారం చుట్టిన ఆదికవి నన్నయ్య మొదలు, తిక్కన, ఎఱ్ఱన, పెద్దన, పోతన, శ్రీనాథకవి సార్వభౌముడు.....ఇలా ఎందరో ప్రాచీనాంధ్ర కవి మహర్షుల చిత్ర పటాలను తెప్పించి పాఠశాలలో అలంకరింపచేశాడు.

అధ్యాత్మిక భావనే భారతీయుల ఆత్మ అని చాటిచెప్పిన వివేకానందుని చిత్రపటానికి పూలదండ వాడకుండా చూడసాగేడు అరవిందరావు.

శ్రద్ధాసక్తులతో క్రమం తప్పకుండా తరగతులకు వస్తున్న వారిని చూసి లోలోన సంబరపడిపోయాడు అరవిందరావు.

ఇంట గెలవలేకపోయినా రచ్చన గెలుస్తున్నందుకు ఆయన మనసు పులకరించసాగింది.

ఎందరో ఆర్థికంగానూ, హార్దికంగానూ అరవిందరావుకు చేయూత నివ్వసాగేరు.

తెలుగు పాఠశాలకు భవనం కట్టేందుకు స్థలాన్ని కేటాయించారు. అమూల్యమైన గ్రంథాలను తెప్పించారు కొందరు. వాటిని పదిలంగా దాచుకునేందుకు బీరువాలు తెప్పించారు. సకల సదుపాయాలను సమకూర్చారు.

తన కల నిజమయినందుకు మహదానంద పడిన అరవిందరావు కళ్లు చెమర్చాయి. వారి ఆదరాభిమానాలకు, తెలుగుభాషపైన వారు కనబరుస్తున్న ప్రేమాభిమానాలకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు అరవిందరావు. తనజన్మ ధన్యమైందని భావించాడు. సంతృప్తిచెందేడు.

అశేష జనవాహిని ఎదుట నిల్చి "అల వైకుంఠ పురంబులో నగరిలో నా మూల సౌధంబు దాపల మందార వనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలోత్పల...." అంటూ మత్తేభంలో మైమర

పించి, "లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె" అంటూ డగ్గుత్తిక గొంతుతో శార్దూలంలో శోకించి వారిని తన్మయుల్ని చేసి తాదాత్మ్యత గావించి కరతాళ ధ్వనులతో ప్రతిస్పందన తెలియజేసినప్పుడు ఆనందబాష్పాలతో, మసక బారిన కళ్ళను తుడుచుకోక తప్పిందికాదు ఆనందరావుకు

వయసు మీరడం వలన, జీవితంలో ఆఖరిమజిలీ జన్మభూమిలోనే గడపాలనే, అంతిమశ్వాస పుట్టిన ఊళ్ళోనే వదలాలనీ, అమెరికా నుండి వీడ్కోలందుకుని తిరుగు ప్రయాణమయ్యాడు అరవిందరావు. అమెరికాలో తెలుగుభాష కీర్తిప్రతిష్ఠల్ని తెలుగుదనపు సొగసుల్ని తెలియపరచి, తెలుగు వైశిష్ట్యాన్ని ఉన్నతశిఖరాలకు చేర్చిన అరవిందరావుకు ఘనంగా సన్మానం చేయ తలపెట్టిన ఓ సాంస్కృతిక సంస్థవారి అభ్యర్థనను మృదువుగా తిరస్కరించాడాయన.

"నా దేశంలో, ఈ తెలుగుగడ్డపై పుట్టిన పిల్లలకు తెలుగుపై మమకారాన్ని, అభిమానాన్ని పెంపొందింపచేయటమే నామ సత్కారంగా భావిస్తాను. అందుకు కృషి చేయండి. మమ్మీ, డాడీ సంస్కృతికి పిల్లల్ని బానిసల్ని చేయకండి అది కనీస కర్తవ్యంగా భావించండి" అని హితవు పలికేడు.

"మా తెనుగుతల్లికి మల్లెపూదండా " వీనులవిందుగా వినపడుతున్న పాటను, పులకిత హృదయంతో ఆస్వాదిస్తూ కుర్చీలో నడుం వాల్చేడు అరవిందరావు.

—o—